# నేడు మహాశివరాత్రి

- ముస్తాబైన శివాలయాలు
- ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి
- ఉపవాస దీక్షల్లో భక్తులు

రామాయంపేట పట్టణంలోని ఆలయాలు శివరాత్రికి ముస్తాబయ్యాయి. శుక్రవారం నగేశ్వరాలయంలో నగరేశ్వరస్వామి కల్యాణం, శనివారం ఆలయాల్లో అన్నదానం చేస్తారు.

**సోమేశ్వరస్వామి ఆలయం ముస్తాబు**

చిన్నశంకరంపేట సోమేశ్వరస్వామి 53 వార్షికోత్సవాలకు ఆలయాన్ని సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. 8న మల్లికార్జునస్వామి పల్లకీసేవ, 9న వేంకటేశ్వరస్వామికి తులసి పుష్పార్చన, బండ్ల ఊరేగింపు, 10న పోచమ్మకు బోనాల ఊరేగింపు, 11న సోమేశ్వరస్వామి కల్యాణం, అనంతరం అన్నదానం, రథోత్సవం, అగ్నిగుండాలు నిర్వహించనున్నారు.

**రామలింగేశ్వరుడు ముస్తాబు**

చిలిపిచెడ్ మండలం చండూర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్నది. 8న ఆలయంలో శివపార్వతుల కల్యాణం, శివస్వాముల దీక్షవిరమణ, ఉపవాస దీక్షలు, భజనలు, 9న బండ్ల ఊరేగింపు, 10న పాచిబండ్ల రథోత్సవం, 11న లంకా దహనం ఉంటాయని పూజారి మురళీధర్‌శర్మ తెలిపారు.

**మెదక్ మండలంలో..**

మెదక్ మండలంలోని శైవ క్షేత్రాలన్నీ ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. మాచవరం శివాలయం, మంబోజిపల్లి కొయ్యగుట్ట మల్లికార్జున స్వామి ఆలయాలను ముస్తాబు చేశారు.

**కొప్పోల్‌లో ఉమాసంగమేశ్వర జాతర**

పెద్దశంకరంపేట మండలంలో దక్షిణ కాశీగా పేరుగాంచిన కొప్పోల్ ఉమా సంగమేశ్వర దేవాలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఉమా సంగమేశ్వర పుణ్యాహవచనం, గణపతి పూజ, కలిశ స్థాపన, నవగ్రహ రాధన, అగ్నిప్రతిష్ఠ, రుత్విక్ వర్ణం, హోమం, దుర్గాభవానీ అభిషేకం, కుంకుమ పూజ నిర్వహించారు. ఆలయంలో అఖండ దీపారాధన వెలిగించారు.


రామాయంపేట : విద్యుత్ దీపాల వెలుగులో నగరేశ్వర ఆలయం


పెద్దశంకరంపేట : గొట్టిముక్కుల రాజులగుట్టలో శివలింగానికి పూజలు చేస్తున్న గ్రామస్తులు


చిలిపిచెడ్ : చండూర్‌లోని రామలింగేశ్వరాలయం గర్భ గుడిలోని శివలింగం


చిన్నశంకరంపేటలో శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన సోమేశ్వరస్వామి దేవాలయం


మెదక్ రూరల్ : మాచవరంలో విద్యుత్ దీపాలతో అలంకరించిన శివాలయం

## పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

- డీఈవో రాధాకిషన్

చేగుంట, మార్చి 7: విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని డీఈవో రాధాకిషన్ ఆదేశించారు. చేగుంటలోని దీప్తి విద్యాలయంలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. పరీక్షల సమయంలో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో ప్రిన్సిపాల్ కృపవరం చల్లా లక్ష్మణ్, స్టీవీనా, సుభాష్‌గౌడ్, నర్సింహులు, సీఆర్పీ రమేశ్ ఉన్నారు.


చేగుంటలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో రాధాకిషన్

## మినీ స్టేడియానికి స్థలం కేటాయింపు


జిల్లా క్రీడలు, యువజన సంక్షేమశాఖ అధికారికి పత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ కమలాద్రి

నర్సాపూర్, మార్చి 7: మున్సిపాలిటీలో మినీ స్టేడియం నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కమలాద్రి సంబంధిత పత్రాలను జిల్లా క్రీడలు, యువజన సంక్షేమశాఖ అధికారి నాగరాజుకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో మినీ స్టేడియం ఏర్పాటుకు కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారని, పట్టణ శివారులోని సర్వేనుంబర్ 731లోని 7 ఎకరాల స్థలాన్ని అందజేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, మేనేజర్ మధుసూదన్, బీఆర్ఎస్ నాయకులు ఆంజనేయులు గౌడ్, నగేశ్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## ఆపదలో తపాలాశాఖ బీమా ఆసరా



బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న మెదక్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ కులకర్ణి సందీప్

- మెదక్ సౌత్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సందీప్

చిన్నశంకరంపేట, మార్చి 7: తపాలా శాఖ ప్రవేశపెట్టిన బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెదక్ సౌత్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ కులకర్ణి సందీప్ సూచించారు. గురువారం చిన్నశంకరంపేట పోస్టాఫీస్‌లో తపాలాబీమా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. భాగిర్థిపల్లి గ్రామానికి చెందిన రెడ్డి సిద్ధిరాములు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి భార్యకు రూ.10లక్షల బీమా చెక్కును గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుకు 2 రూపాయలు చెల్లించడంతో రూ.15లక్షల యాక్సిడెంటల్ పాలసీ పొందొచ్చన్నారు. కార్యక్రమంలో ఐపీపీబీ మెదక్ మేనేజర్, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ హర్షవర్ధన్, చిన్నశంకరంపేట పోస్టుమాస్టర్ వెంకటరమణ, చంద్రాగౌడ్, విజయ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి చేగుంట బీజేపీ నాయకులు


మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నాయకులు

చేగుంట, మార్చి 7: కాంగ్రెస్‌లోని ప్రతి కార్యకర్తనూ కాపాడుకుంటామని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సాయిబాలాజీ గార్డెన్‌లో బీజేపీ నాయకులు తాడెం వెంగళ్‌రావు, మాజీ ఎంపీపీ అల్లిరమ, మాజీ సర్పంచులు మ్యాకల వెంకటస్వామి, జగన్‌గౌడ్, అంజాగౌడ్, మాజీ ఉప సర్పంచ్ మమ్మద్ గౌస్‌జాని, మైనార్టీ నాయకులు సాబెర్‌ఉస్సేన్, నదీం ఆలీతోపాటు పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో గురువారం చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్ల నవీన్, తీగల భూంలింగం గౌడ్, మాజీ సర్పంచ్ కాశబోయిన భాస్కర్, సంద్రుగు సతీశ్, శ్రీకాంత్, ఆగం, రాజాగౌడ్, సాయికుమార్‌గౌడ్, అంజిరెడ్డి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు విద్య ఎంతో అవసరం



రెడ్డిపల్లి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులతో జీఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు

చేగుంట, మార్చి 7: మహిళలకు విద్య ఎంతో అవసరమని, విద్య నేర్చుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్ తెలిపారు. వడియారం జడ్పీహెచ్ఎస్, రెడ్డిపల్లి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను గురువారం అందజేశారు. కార్యక్రమంలో ప్రోగామ్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## శంకర్‌గౌడ్ మృతి బీఆర్ఎస్‌కు తీరనిలేటు


నార్సింగి సొసైటీ చైర్మన్ శంకర్‌గౌడ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న కత్తి కార్తీకగౌడ్

చేగుంట, మార్చి 7 : నార్సింగి సొసైటీ చైర్మన్ శంకర్‌గౌడ్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరనిలోటని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని మహిళా నాయకురాలు కత్తి కార్తీకగౌడ్ అన్నారు. శంకర్‌గౌడ్ మృతి చెందిన విషయం తెలుసుకుని నార్సింగిలోని ఆయన కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బాబు, నేతలు రాజేశ్, ఆకుల మల్లేశంగౌడ్, నర్సంపల్లి బాల్‌రాజ్‌గౌడ్ తదితరులున్నారు.

### అధిక వడ్డీ.. ఆశ చూపి మోసం

తూప్రాన్, మార్చి 7: అధిక వడ్డీ ఆశ చూపి మోసానికి పాల్పడి, నిందితుడు సినీ ఫక్కీలో ఉడాయించిన ఘటన తూప్రాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం సంచలనం సృష్టించింది. ఎస్సై శివానందం తెలిపిన వివరాలు.. తూప్రాన్‌కు చెందిన బిజిలీపురం యాదగిరి చిట్టీలు, గృహ రుణాలు, ఇన్‌స్టాల్‌మెంట్లో మొబైల్ ఫోన్లు ఇప్పించేవాడు. ఇటీవల చిట్టీలు చిట్టీ డబ్బులు ఇవ్వకుండా, అధిక వడ్డీ ఇస్తానంటూ తప్పించుకున్నాడు. బాధితుల ఒత్తిడి పెరగడంతో ఈ నెల 4న భార్య, పిల్లలతో నిజామాబాద్ పెద్దగుట్టకు వెళ్తున్నట్లు చెప్పి, తిరిగి రాలేదు. దీంతో యాదగిరి తల్లి సుశీల తూప్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. యాదగిరి కనిపించడం లేదని తెలియడంతో గురువారం 9 మంది బాధితులు అగ్రిమెంట్లు, బాండ్ పేపర్లతో తూప్రాన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివానందం తెలిపారు.

### వాహనం ఢీకొని యాచకురాలు మృతి

చిన్నశంకరంపేట, మార్చి 7: గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకురాలు మృతి చెందిన ఘటన చిన్నశంకరంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబాజిపేట శివారులో మెదక్, చేగుంట రహదారిపై గురువారం జరిగింది. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డికి చెందిన లక్ష్మి(50) కొన్ని రోజులుగా భిక్షాటన చేస్తున్నది. గురువారం అంబాజీపేట శివారులో దుర్గామాత ఆలయం వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందింది. మృతురాలి భర్త కాశయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE
PRL. JUNIOR CIVIL JUDGE
AT : MEDAK
O.S.NO. 546 OF 2023
Between:
Palet Yesu ...Petitioner / Claimant
AND
The Tahsildar Chegunta and Another ...Respondent No. 2
NOTICE
To Whomsoever may it concern
Please take notice that the Petitioner / Plaintiff has filed the above case towards to declare as the legal heir of Smt. Paleti Chinna Pochhamma, W/o. Late Paleti Ramaiah and Paleti Ramaiah, S/o. Late Narsaiah. That this Hon'ble Court was passed orders to publish this notice vide O.S.No. 546 of 2023 against you. The case is posted on 19-03-2023 at 10-30 A.M. on the said Court. You are hereby called upon to be present personally or through Advocate on the said date and failing which the matter will be decided in your absence the matter will be set exparte.
This notice through publication according to the orders of this Hon'ble Court vide O.S.NO 546 OF 2023.
(By order of the Court)
Sd/- Vallakati Narsimulu, Advocate
H.No. 2-88/1, Thogita Village, Haveli Ghanapur Mandal, Medak District,
Cell: 8985559036.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-311802-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


మెదక్ మున్సిపాలిటీ : మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాగౌడ్

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- జడ్పీ చైర్సపర్సన్ హేమలతాగౌడ్
- మహిళా పోలీసు సిబ్బందిని సన్మానించిన ఎస్పీ బాలస్వామి

మెదక్ మున్సిపాలిటీ/ మెదక్ అర్బన్, మార్చి 7 : జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాగౌడ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. అనంతరం మహిళా ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డిప్యూటీ సీఈవో రంగాచారి, సూపరింటెండెంట్ మల్లేశం, సిబ్బంది అమూల్య, నిఖిత, భూలక్ష్మి, జయమ్మ పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని ఎస్పీ బాలస్వామి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం, భరోసా సెంటర్, టీఎన్జీవో భవన్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్, సీఐలు పాల్గొన్నారు.

**రక్షణ కల్పిస్తే అన్నిరంగాల్లో రాణిస్తారు**

రామాయంపేట, మార్చి 7 : మహిళల రక్షణకు సమాజంలో చాలా మార్పులు జరగాలని, అప్పుడే మహిళలు అన్నిరంగాల్లో స్వేచ్ఛగా ముందుకొస్తారని వాయిస్ ఆఫ్ భారత్ వ్యవస్థాపకురాలు వరలక్ష్మి అన్నారు. గురువారం రామాయంపేటకు విచ్చేసిన ఆమెను టీపీటీఎఫ్ ఆహ్వానించింది. మహిళా సదస్సులో భాగంగా సమావేశానికి హాజరైన 200 మంది మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్, జిల్లా అధ్యక్షుడు ప్రణీద్‌కుమార్, కార్యదర్శి బాలయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్, అసోసియెట్ అధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి మోహన్, నర్సింహారావు, రశీద్, విద్యాసాగర్, నవీన్, రత్నాకర్, విఠల్, విఠోభా తదితరులు పాల్గొన్నారు.



మెదక్ అర్బన్ : మహిళా సిబ్బందిని సత్కరిస్తున్న ఎస్పీ బాలస్వామి


మెదక్ అర్బన్ : మాట్లాడుతున్న ఎస్పీ బాలస్వామి



రామాయంపేట : మాట్లాడుతున్న వాయిస్ ఆఫ్‌భారత్ వ్యవస్థాపకురాలు వరలక్ష్మి

## పెద్దగుట్ట దర్గాలో ఎమ్మెల్యే పూజలు

శివ్వంపేట, మార్చి 7: నిజామాబాద్ జిల్లా బడాపహాడ్ (పెద్దగుట్ట) దర్గాలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యేగా సునీతారెడ్డి విజయం సాధిస్తే గుట్టపైకి మోకాళ్లతో వచ్చి మొక్కు చెల్లించుకుంటానని గోమారం గ్రామానికి చెందిన గంగిరెడ్డి నర్సింహారెడ్డి మొక్కుకున్నాడు. మొక్కులో భాగంగా ఆయన గుట్టపైకి మోకాళ్లతో వెళ్లి మొక్కు తీర్చుకుని అభిమానం చాటాడు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ హరికృష్ణ, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, బీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేశం, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు లాయక్, మాజీ వైస్ ఎంపీపీ హన్మంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, శశిధర్ రెడ్డి, నాయకులు గూడూరు యాదగౌడ్, మహేందర్‌రెడ్డి, వీరారెడ్డి, శ్రీశైలం యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, తాటికొండ రాజశేఖర్‌గౌడ్, మహ్మద్ కైఫ్ ఉన్నారు.


మోకాళ్లతో గుట్టపైకి వెళ్తున్న అభిమాని నర్సింహారెడ్డి, మొక్కు చెల్లించుకునేందుకు వస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

## 'గ్యారెంటీ'లకు దరఖాస్తు చేసుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ/నిజాంపేట/వెల్దుర్తి, మార్చి 7 : మున్సిపల్ కార్యాలయంలోని ప్రజాపాలన కేంద్రాల్లో గృహలక్ష్మి, మహాలక్ష్మి పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జానకీరామ్‌సాగర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహజ్యోతికి ప్రజాపాలన దరఖాస్తు రసీదు జిరాక్స్‌తోపాటు ఆధార్, రేషన్‌కార్డు, కరెంట్ బిల్లు జిరాక్స్ ప్రతులు, మహాలక్ష్మికి ప్రజాపాలన రసీదు జిరాక్స్‌తోపాటు ఆధార్, రేషన్‌కార్డు, గ్యాస్ బిల్లు జిరాక్స్ ప్రతులు అందజేయాలన్నారు.

**నిజాంపేటలో దరఖాస్తుల స్వీకరణ**

నిజాంపేట ప్రజాపాలన సేవా కేంద్రంలో గృహలక్ష్మి, మహాలక్ష్మి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో రాజిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది విఠల్, శ్రీను ఉన్నారు.


వెల్దుర్తిలో దరఖాస్తులు స్వీకరణ

**అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి**

వెల్దుర్తి ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులు దరఖాస్తులను ప్రజాపాలన కేంద్రంలో అందజేయాలని ఎంపీడీవో జగదీశ్వరాచారి కోరారు. గతంలో ఇచ్చిన దరఖాస్తుల్లో తప్పు లు ఉండడంతో, వాటిని సరిచేయడానికి, కొత్తగా దరఖాస్తులు ఇవ్వడానికి కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

### ఎన్నికల విరాళాలను బీజేపీ ప్రకటించాలి

నర్సాపూర్, మార్చి 7: ఎలక్టోరల్ బాండ్ విధానంతో సంస్థలను భయభ్రాంతులకు గురిచేసి బీజేపీ విరాళాలు వసూలు చేస్తున్నదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ ఆరోపించారు. గురువారం పట్టణంలోని ఎస్బీఐ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్టోరల్ బాండ్ విధానంతో బీజేపీ కార్పొరేట్ సంస్థలను భయభ్రాంతులకు గురిచేసి రూ. 30వేలకోట్ల విరాళాలు సేకరించిందన్నారు. విరాళాలు బహిర్గతం చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించినా ఇప్పటివరకు ప్రకటించలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జ్యోతీసురేశ్‌నాయక్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, మండలాల అధ్యక్షులు సుదర్శన్‌గౌడ్, మల్లేశ్, స్థానిక నాయకుడు రిజ్వాన్ ఉన్నారు.

### కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 7 : జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు 30 కేంద్రాల్లో నిర్వహించారు. జనరల్‌లో 4,020 మందికి 3,890మంది, ఒకేషనల్‌లో 540 మంది (97)శాతం హాజరయ్యారని జిల్లా నోడల్ అధికారి సత్యనారాయణ తెలిపారు.

### రైతులను ప్రోత్సహించాలి

రేగోడ్, మార్చి 7 : ఆయిల్‌పామ్ మొక్కల సాగుకు రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయాధికారి జావీద్ సూచించారు. కొండాపూర్‌లో సాగు చేసిన ఆయిల్ పామ్ మొక్కలను ఆయన గురువారం పరిశీలించారు. ఆయిల్‌పామ్ సాగులో తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. లివింగ్ ఫుడ్స్ కంపెనీతో ఆయిల్‌పామ్ మొక్కలు పంపిణీ చేయడానికి ఒప్పందం జరిగిందన్నారు. రైతులు ఆయిల్‌పామ్ మెక్కల పెంపకాన్ని చేపట్టాలన్నారు. నీటి వసతి ఉన్న రైతులు పట్టాబుక్, 2 పాస్ ఫొటోలు, గ్రామ వ్యవసాయాధికారికి ఇవ్వాలన్నారు. ఆయనతో సిబ్బంది వినీత్‌కుమార్, రైతులు ఉన్నారు.

### 'సీఆర్పీఎఫ్' కవాతు

రామాయంపేట, మార్చి 7: ఎన్నికలు శాంతియుతంగా జరగాలని పారామిలిటరీ దళాలతో పట్టణంలో సీఐ వెంకటేశ్, ఎస్సై రంజిత్ ఆధ్వర్యంలో గురువారం కవాతు నిర్వహించారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ఎస్పీ బాలస్వామి ఆదేశాల మేరకు కవాతు నిర్వహించినట్లు తెలిపారు.

### ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

నర్సాపూర్,మార్చి7: కులం పేరుతో దూషిస్తూ దాడిచేసిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాల మహానాడు నాయకుడు నరేశ్ డిమాండ్ చేశారు. పెద్దచింతకుంటలో మాల కులానికి చెందిన నర్సింహులు కొన్నిరోజులుగా ఉపాధి మెట్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన తిరుపతి విజయ్ తన తల్లికి ఉపాధి కూలి ఎందుకు రాలేదని దుర్భాషలాడుతూ, కులం పేరిట దూషిస్తూ దాడి చేశాడన్నారు. విజయ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని నరేశ్ డిమాండ్ చేశారు.

### తైబజార్ వేలం

రామాయంపేట, మార్చి 7: పట్టణంలో మార్కెట్ తైబజార్‌ను గురువారం వేలం పాట వేశారు. తైబజార్ వేలంలో గతేడాది కంటే ఈసారి రూ.20.01 లక్షలకు పట్టణానికి చెందిన గోపి దక్కించుకున్నారు. ఈ వేలంపాటను చైర్మన్ జితేందర్‌గౌడ్, కౌన్సిలర్లు, పట్టణవాసుల సమక్షంలో నిర్వహించినట్లు కమిషనర్ దేవేందర్ తెలిపారు.

### బ్రెయిన్ స్ట్రోక్‌తో పాత్రికేయుడు మృతి


చంద్రశేఖర్‌గౌడ్ (ఫైల్)

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 7: బ్రెయిన్ స్ట్రోక్‌తో సీనియర్ పాత్రికేయుడు చంద్రశేఖర్ గౌడ్(52) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. పది రోజులుగా హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చంద్రశేఖర్ గౌడ్‌కు వైద్యులు వైద్యం అందిస్తున్నారు. గురువారం గిద్దకింద శ్మశాన వాటికలో అంత్రక్రియలు నిర్వహించారు.